క్లుప్తంగా

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవదాయ–ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1,69,945 ఆదాయం వచ్చినట్లు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు. అలాగే అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.43,661 రాగా మొత్తం రూ.2,13,606 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఆయన తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు భక్తులకు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్దఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేద పండితులు స్వామికి లక్షతులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామికి భక్తులు పటికబెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

100 మందికి ఉచిత వైద్య సేవలు



ఈదరాడలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలు

మామిడికుదురు: ఈదరాడ గ్రామ పంచాయతీ వద్ద శనివారం తాటిపాక మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కుసుమ వనజకుమారి ప్రారంభించారు. పలు విభాగాలకు చెందిన వైద్యులు ఉచితంగా సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీపీ వనజకుమారి మాట్లాడుతూ పలు సంస్థల ప్రతినిధులు ఉచిత వైద్య శిబిరాల పేరిట ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. తద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



బాధితులకు సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

అంబాజీపేట: ఇటీవల వాకలగరువులో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ శనివారం సాయం పంపిణీ చేశారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు, సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో బాధితులు దాకే వెంకట్రావు, ముత్తాబత్తుల పండు కుటుంబాలకు వంట సామగ్రి, టార్పాలిన్, బ్లాంకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఒరిగిటి బాలారాజు, వై.రత్నప్రసాద్, రొక్కాల శివ, శ్రీరామమూర్తి, దుర్గారావు, స్టీఫెన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అఖండ హరిరామ సంకీర్తనకు వెళ్లిన భక్తులు


అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలేనికి చెందిన శ్రీనివాస భజన భక్త బృందం తిరుమలలో నిర్వహించే అఖండ హరిరామ సంకీర్తనకు శనివారం తరలివెళ్లారు. ఈ నెల 9న తిరుపతి వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో చేపట్టే అఖండ హరినామ సంకీర్తనలో 16 మంది మహిళలు పాల్గొననున్నారు. భజన గురువు వాసంశెట్టి శ్రీనివాస గురు స్వామి ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరుమలకు తరలి వెళ్లారు.

శిథిలావస్థలో సూర్యారావుపేట వంతెన

- ప్రజల శ్రమదానంతో రూపుదిద్దుకున్న వైనం
- రెండు నియోజకవర్గాల ప్రజల రాకపోకలపై ప్రభావం
- ఓఎన్జీసీ కార్యకలాపాల వల్లే ఈ దుస్థితి అంటున్న జనం



చింతలూరు–సూర్యారావుపేట మధ్య కోరంగి కాలువపై నిర్మించిన వంతెన



బీటలు వారిన వంతెన స్తంభం

ఆలమూరు: ఆదాయమే ధ్యేయంగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఓఎన్జీసీ తమ కార్యకలాపాలను జరుపుతుందనే అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతుంది. ఇటీవల జిల్లాలోని కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లోని సూర్యారావుపేట, తాతపూడి, చింతలూరు, కపిలేశ్వరపురం, సంధిపూడి గ్రామాల్లో విస్తృతంగా ఏర్పాటు చేసిన చమురు బావుల అన్వేషణ (రిగ్) వల్ల అతి పెద్ద భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికే రెండు నియోజకవర్గాల పరిధిలో రహదారులు ధ్వంసం కాగా చింతలూరు–సూర్యారావుపేట మధ్య కోరంగి కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరమైన రీతిలో శిథిలావస్థకు చేరుకుంది.

శ్రమదానంతో రూపుదిద్దుకున్న కోరంగి కాలువ వంతెన

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటూ పంటులపై ప్రయాణిస్తున్న సూర్యారావుపేట వాసులకు కోరంగి కాలువపై వంతెన నిర్మాణం చేపట్టడం వరంలా మారింది. దీంతో 1983–84లో అప్పటి ఎన్టీఆర్ హయాంలోని టీడీపీ ప్రభుత్వం కేవలం వంతెన నిర్మాణానికి రూ.7.8 లక్షలను మంజూరు చేయగా గ్రామస్తులు ఇంటికి ఇద్దరు చొప్పున శ్రమదానం చేసి ఏడాది కాల వ్యవధిలో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి వాడుకలోకి తీసుకువచ్చారు. అప్పట్లో డిజైన్ లోపమో ఏమోగాని వంతెన ఎత్తు భారీగా ఉండటంతో ఆ వంతెనపై ప్రయాణం సాహసోపేతంగా మారింది. కాలానుగుణ పరిస్థితుల్లో ఆ వంతెనపై ప్రయాణం ప్రజలకు అలవాటు అయిపోయింది. అయితే ఇటీవల ఓఎన్జీసీకి చెందిన భారీ వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగించడంతో పిల్లర్లు బీటలు వారి వంతెన ప్రమాదకరమైన స్థితికి చేరుకుంది. దుస్థితి చూస్తున్న ప్రజానీకం ఎక్కణ్నైనా కూలిపోతుందేమోనని భయాందోళన చెందుతున్నారు.

రెండు నియోజకవర్గాలకు వారధిగా..

కొత్తపేట నియోజకవర్గంలోని ఆలమూరు మండలాన్ని, మండపేట నియోజవర్గంలోని కపిలేశ్వరపురం మండలాన్ని ఈ వంతెన కలుపుతుంది. అయితే వంతెన అవతల ఆలమూరు మండలంలోని అతి చిన్న గ్రామమైన సూర్యారావుపేట ఉంది. ఆ గ్రామంలో అందరూ పేద, బడుగు, బలహీన వర్గాల వారే నివసిస్తున్నారు. ఈ వంతెనకు ఏదైనా జరిగితే రెండు నియోజకవర్గాల మధ్య సంబంధాలు తెగిపోవడంతో పాటు సూర్యారావుపేట వాసులు తీవ్ర ఇక్కట్లు పడవలసిన దుస్థితి ఏర్పడుతుంది. దీనిపై ఆ గ్రామస్తులు పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు అనేకమైన వినతులు సమర్పించినా పట్టించుకోకపోవడం పరిస్థితికి అద్దం పడుతుంది. గత ఏప్రిల్‌లో కొత్తూరు సెంటర్‌లో ఓఎన్జీసీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వంతెన దుస్థితిని వివరించగా ఆ సమయంలో ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ఇప్పటి వరకూ అమలు కాలేదు.

పెద్ద కాలువ వంతెనను పునర్నిర్మించాలి

ఓఎన్జీసీకి చెందిన భారీ వాహనాల రాకపోకల వల్ల శిథిలమైన సూర్యారావుపేట పెద్ద కాలువ వంతెనను పునర్నిర్మించాలి. వంతెనకు ఏ సమయంలోనైనా తీవ్ర నష్టం జరిగితే గ్రామస్తులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయే ప్రమాదముంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సత్వరమే స్పందించి వంతెనకు నష్ట నివారణ చర్యలు చేపట్టాలి.

– చింతపల్లి వెంకటలక్ష్మి, సర్పంచ్, సూర్యారావుపేట

ప్రతిపాదనలు పంపించాం

సూర్యారావుపేట వంతెన దెబ్బతిన్న విషయాన్ని గుర్తించగా రెండు విధాలుగా పనులు చేపట్టేందుకు ప్రతిపాదలను సిద్ధం చేసి మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. మరమ్మతులు చేయాల్సి వస్తే రూ.70 లక్షలు, పునర్నిర్మించవలసి వస్తే రూ.నాలుగు కోట్లు అవుతుందని అంచనాలను రూపొందించాం. ఇరిగేషన్ శాఖ భాగస్వామ్యంతో వంతెనను ఆధునీకరిస్తాం.

– టి.సూర్యనారాయణరావు, ఆర్‌అండ్‌బీ డీఈ, రామచంద్రపురం

ర్యాలిలో అన్నపూర్ణ డే కేర్ హోం ప్రారంభం



ర్యాలిలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహిత్, సీత

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో శ్యామ్ జాదూగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనూస్ స్వచ్ఛంద సంస్థ నూతనంగా అన్నపూర్ణ డే కేర్ హోం ఫర్ ఏజ్డ్‌ను ప్రారంభించింది. దీని ద్వారా వృద్ధులకు వైద్య సేవలు, భోజన సదుపాయం, ఆటలు, పాటలు వంటి ఉచిత సేవలను అందించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్, సీతలు తెలియజేశారు. సుమారు 30 మంది వృద్ధులకు ఉచిత అధునాతన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయా వ్యాధులకు సంబంధించి మందులు పంపిణీ చేశారు. వారికి ఆటపాటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆ వృద్ధులకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బొబ్బర్లంక ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ తేజశ్రీ, సంస్థ సభ్యులు చింతా శ్యామ్‌కుమార్, అన్నపూర్ణ, రుషిత్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికైన బాలదుర్గ

కె.గంగవరం: మండలంలోని అముజూరు ప్రాథమిక పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న జంజం బాలదుర్గ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం చొల్లంగి శ్రీను తెలిపారు. తునిలో గల రెసిడెన్షియల్ స్కూల్‌లో బాలదుర్గ ఐదో తరగతి ప్రవేశానికి అర్హత పొందిందని ఆయన పేర్కొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నాం

- ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య
- ఎమ్మార్సీ వద్ద నిరసన
- నేడు కాకినాడలో నిరసన విజయవంతం చేయాలి



కొత్తపేట ఎమ్మార్సీ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న ఐక్యవేదిక ఉపాధ్యాయులు

కొత్తపేట: ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్జీటీలకు) మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. కౌన్సెలింగ్ నిర్వహణలో ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాష్ట్ర ఉపాధ్యా సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో మండల వనరుల కేంద్రాల (ఎమ్మార్సీ) వద్ద నిరసన ప్రదర్శనలో భాగంగా కొత్తపేట ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్, ఎస్టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సమాఖ్య నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అంగీకరించి, ఇప్పుడు వెబ్ ఆప్షన్స్ ఇవ్వమని ప్రభుత్వం అధికారుల ద్వారా బలవంతపెడుతుందని అన్నారు. ఈ విధానాన్ని తాము తీవ్రంగా ఖండిస్తూ బహిష్కరిస్తున్నామని తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహణలో మరే ప్రత్యామ్నాయాలు తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఆందోళన చెందకుండా వెబ్ ఆప్షన్ల ప్రక్రియను బహిష్కరించాలని, ఆదివారం కాకినాడ డీఈఓ కార్యాలయం వద్ద జరుగు నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ తరఫున జిల్లా, రాష్ట్ర, మండల నాయకులు యెలిశెట్టి మురళి, టి.విజయకృష్ణ, రామ్‌కుమార్, భాస్కరశాస్త్రి, ఎస్టీయూ తరఫున ఆచంట రామచంద్రప్రసాద్, బండారు శేషు, బండారు నారాయణ, అక్కిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ వద్దు... మాన్యువలే కావాలి

మామిడికుదురు: వెబ్ కౌన్సెలింగ్‌ను రద్దు చేసిన ఎస్జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. తక్షణం వెబ్ కౌన్సెలింగ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని మాన్యువల్ కౌన్సెలింగ్‌ను అమలు చేయాలన్నారు. అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. ఈ నిరసనలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, పీఆర్‌టీయూ అధ్యక్షులు వై.పల్లంరాజు, ఏపీటీటీఏ అధ్యక్షులు షబ్బీర్ హుస్సేన్, ఆయా సంఘాల ప్రతినిధులు వైవీ సత్యనారాయణ, టీఆర్‌కె గణపతిరావు, ఎం.సత్యనారాయణ, తోట వెంకటేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: ప్రభుత్వం తొలుత ప్రకటించిన విధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారానే ఉపాధ్యాయ బదిలీలు జరగాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు మలికిపురం విద్యాశాఖాధికారి వైవీ సత్యనారాయణకి శనివారం వినతిపత్రం అందించారు. తొలుత ప్రకటించిన విధానంలో కాకుండా వెబ్ ఆప్షన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇష్టానుసారం ప్రకటించడం తగదని ఉపాధ్యాయుల ఐక్యవేదిక పేర్కొంది. తుది సీనియర్ జాబితా విడుదల చేయకుండా, ఏ విధమైన గ్రీవెన్స్ పరిష్కరించకుండా ఆప్షన్ పెట్టుకోమని సూచించడం తగదని పేర్కొన్నారు. నాయకులు ఉండ్రు మోహనరావు, బేతినీడి శ్రీనివాసరావు, తిక్కిశెట్టి శ్రీనివాస్, బత్తుల చిట్టిబాబు, అప్పారి రామకృష్ణ, కంకటాల చంద్రశేఖర్, మట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఇప్పటి వరకూ జరిగిన బదిలీల్లో పొరబాట్లను సరిదిద్ది నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ పి.గన్నవరంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. వెబ్ కౌన్సెలింగ్‌ను తక్షణమే నిలిపి వేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు నల్లా బాలాజీ, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రీనివాస్, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు డి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గిడ్ల శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరిగేటి రత్నం, ఎస్టీయూ జిల్లా ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కాపవరపు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాలో డ్వాక్రా సంఘ మహిళలకు, వెలుగు సిబ్బందికి శిక్షణనిస్తున్న వ్యాయయోపాధ్యాయిని

అయినవిల్లి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ జి.వెంకటసరోవరరావు అన్నారు. శనివారం ఉదయం మండలంలోని ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కళాశాల క్రీడా ప్రాంగణంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మండల మహిళా సమాఖ్య, వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో జి.వెంకట సరోవరరావు విచ్చేశారు. ఎంపీడీఓ జి.వెంకట సరోవరరావు మాట్లాడుతూ యోగాతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా ఉచిత యోగా శిక్షణను నిర్వహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన డ్వాక్రా గ్రూపు మహిళలకు వ్యాయామోపాధ్యాయులు ఎస్.విష్ణుకుమారి యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు అకౌంటెంట్ భవాని, వీవో ఏలు నాగమణి, నాగలక్ష్మి, నాగదుర్గ, ధనలక్ష్మి, భారతి, మల్లేశ్వరి, దుర్గ, అన్నపూర్ణ, జ్ఞానేశ్వరి, వెంకటేశ్వరరావు అధిక సంఖ్యలో డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బంగారు పతకాలు



ప్రతిభావంతులకు నగదు, బంగారు పతకాలు అందిస్తున్న చైర్మన్ నవీన్

మామిడికుదురు: పదో తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన మూడు మండలాలకు చెందిన విద్యార్థులకు మల్లికా మెమోరియల్ ట్రస్టు ద్వారా శనివారం నగదు ప్రోత్సాహాలతో పాటు బంగారు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో ట్రస్టు చైర్మన్ ప్రతాప్‌నేని నవీన్ ఆధ్వర్యంలో మామిడికుదురు, పి.గన్నవరం, అంబాజీపేట మండలాలకు చెందిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి నగదు ప్రోత్సాహం, బంగారు పతకం, సర్టిఫికెట్ అందించారు. ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకే ట్రస్టును ఏర్పాటు చేశామని చైర్మన్ తెలిపారు. ప్రతి ఏడాది ట్రస్టు ద్వారా ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం మైలవరపు రవీంద్రనాథ్, భూపతి మనోహర్‌రాజు, పితాని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న నాయకులు

రాజోలు: అంతర్ జిల్లాల తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీల్లో రాజోలుకు చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. శనివారం స్థానిక పైకా భవనంలో ప్రతిభ చూపిన క్రీడాకారులను పలువురు అభినందించారు. ఈ 4న కాకినాడలో జరిగిన పోటీల్లో ఎం.హేమంత్, ఎం.మురళి, వై.గంగాభవాని, ఎ.హేమ, కె.ధాత్రిజ, వై.శశిరేఖ, జి.దినేష్‌ఆదిత్య, కేడీటీ వెంకటేష్ బంగారు పతకాలు సాధించారు. అలాగే వై.కార్తిక్, ఎం.భువనేష్, జాహ్నవి, మనీష్, మనోజ్‌లు వెండి పతకాలు సాధించగా అక్షయ్, పవన్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 9న అనంతరపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ ఆర్.మణికంఠ తెలిపారు. రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు. తైక్వాండో పోటీలకు శిక్షణ ఇచ్చి క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న కోచ్ మణికంఠను ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ కొపనాతి పుష్పలత, నాయకులు జగడం సత్యనారాయణ, ముదునూరి లతేంద్రవర్మ, బోళ్ల వెంకటరమణ, భారం రాజా, తిక్కిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ అన్నదాతా సుఖీభవ ఇవ్వాలి



నగరం సమావేశంలో పాల్గొన్న కౌలు రైతులు

మామిడికుదురు: కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరామ్ డిమాండ్ చేశారు. నగరం మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శనివారం జరిగిన కౌలు రైతుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు బలరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి 70 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూయజమాని సంతకం నిబంధన తొలగిస్తామని కూటమి హామీ ఇచ్చిందన్నారు. ముసాయిదా చట్టం తీసుకువచ్చినా అది అమల్లోకి రాలేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించడం లేదన్నారు. కేంద్రం ఇస్తున్న రూ.ఆరు వేలు సహాయం కౌలు రైతులకు ఇవ్వడం లేదన్నారు. ఈ ఏడాది ధాన్యం, మిర్చి, పొగాకు, కోకో, కందులు, మినుములు ఇలా అన్ని పంటల ధరలు పడిపోయాయని వాపోయారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతి కౌలు రైతును గుర్తించి వారిని ఆదుకోవాలన్నారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 11న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీతల రామచంద్రరావు, సంఘం ప్రతినిధులు కె.సత్యనారాయణ, తాటికాయల ఉదయభాస్కర్, రాంబాబు, సత్యనారాయణ, పెయ్యల సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు
- పేదలకు దాన ధర్మాలు



మామిడికుదురులో జరిగిన బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొత్తపేట: ముస్లింలు బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కాజాబాబు ఆధ్వర్యంలో బక్రీద్ నిర్వహించారు. ముస్లిం మత గురువులు, పలువురు ముస్లింపెద్దలు మాట్లాడుతూ బక్రీద్ విశిష్టతను వివరించారు. తమ పూర్వీకుల ఆత్మ శాంతి కోసం ప్రార్థించారు. ఎవరి స్థాయిలో వారు పేదలకు దాన ధర్మాలు చేశారు. అనంతరం ఎవరి నివాసాలకు వారు వెళ్లి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలసి విందు జరుపుకొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ పండగను మండలంలోని ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక పెద్దవీధిలో ఉన్న అంజుమనే ఇందాదుల్ ముస్లిమీన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అంబాజీపేట సెంటర్ మీదుగా ఖబరస్తాన్‌కు చేరుకుని మృతులకు నివాళులర్పించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ పండగను శనివారం ముస్లింలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని మామిడికుదురు షియా జామియా, సున్నీ జామియా మసీదుల్లో ప్రత్యేక నమాజులు జరిగాయి. మత ప్రబోధకుడు మొహ్మద్ ఇబ్రహీమ్, తారిఖ్ అన్వర్ రజ్వీ బక్రీద్ ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లా సన్నిధిలో ఖుర్బానీ చేసేందుకు సిద్ధపడడం, అతని భక్తికి మెచ్చిన అల్లా ఇబ్రహీం ఇస్మాయిల్ స్థానంలో గొర్రెను ప్రవేశపెట్టిన వృత్తాంతాన్ని వివరించారు. మొగలికుదురు మసీదు, నగరం పెద పంజీషాలో నమాజులను ఆలపించారు. దీనిలో భాగంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెదపట్నం, కొమరాడ, మగటపల్లి గ్రామాల్లోని మసీదుల్లో కూడా బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.